భారీ విజయంతో ప్లేఆఫ్స్‌కు గుజరాత్

టైటాన్స్‌దే ఫస్ట్ బెర్త్

సాయి సూపర్ సెంచరీ • రాహుల్ శతకం వృథా

ఢిల్లీ: ఐపీఎల్-18లో మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ దుమ్మురేపింది. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 10 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించి ఈ సీజన్‌లో ప్లేఆఫ్స్ చేరిన తొలి జట్టుగా నిలిచింది. క్యాపిటల్స్ నిర్దేశించిన 200 పరుగుల ఛేదనను టైటాన్స్ 19 ఓవర్లలోనే దంచేసింది. సాయి సుదర్శన్ (61 బంతుల్లో 108 నాటౌట్, 12 ఫోర్లు, 4 సిక్సర్లు), శుభ్‌మన్ గిల్ (53 బంతుల్లో 93 నాటౌట్, 3 ఫోర్లు, 7 సిక్సర్లు) మెరుపులతో ఆ జట్టు ఘనవిజయం సాధించింది. ఢిల్లీ బౌలర్లు ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. మొదట బ్యాటింగ్ చేసిన క్యాపిటల్స్.. స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (65 బంతుల్లో 112 నాటౌట్, 14 ఫోర్లు, 4 సిక్సర్లు) ఐపీఎల్‌లో ఐదో శతకంతో రాణించడంతో 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది.

రాహుల్ క్లాస్ ఇన్నింగ్స్

ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా వచ్చిన రాహుల్.. టీ20లలో పరిస్థితులకు తగ్గట్టు ఇన్నింగ్స్‌ను ఎలా ఆడాలో చేతల్లో చూపించాడు. ఆరంభంలో రాహుల్ ఆట చూస్తే.. తొలి 18 బంతుల్లో అతడు చేసినవి 17 పరుగులే. ఆ తర్వాత కాస్త గేర్ మార్చినా.. పూర్తిస్థాయిలో జూలు విదిల్చలేదు. మూడో ఓవర్‌లోనే డుప్లెసిస్ (5) నిష్క్రమించడంతో రాహుల్ ఆచితూచి ఆడాడు. సిరాజ్ 5వ ఓవర్లో రెండు బౌండరీలు బాదిన అతడు.. రబాడా 6వ ఓవర్లో 6, 4, 6తో పంథా మార్చాడు. పౌరెల్ క్రీజులో నిలిచినా అతడు స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించలేకపోయాడు. 35 బంతుల్లో అర్ధ శతకం పూర్తయ్యాక రాహుల్ పూర్తిస్థాయిలో జోరు పెంచాడు. ఫిఫ్టీ నుంచి 90లలోకి రావడానికి రాహుల్ తీసుకున్న బంతులు 16 మాత్రమే. ప్రసిద్ధ్ 19వ ఓవర్లో 6, 4తో 60 బంతుల్లో ఈ ఢిల్లీ ఓపెనర్ శతకం పూర్తయింది. ఐపీఎల్‌లో అతడికి ఇది ఐదో సెంచరీ కాగా మూడు ఫ్రాంచైజీల (పంజాబ్, లక్నో, ఢిల్లీ) తరపున ఆడుతూ శతకం సాధించిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు.

అజేయ టైటాన్స్

ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆరంభం నుంచే లక్ష్యం దిశగా సాగింది. అక్షర్ తొలి ఓవర్లోనే పది పరుగులు రాగా నటరాజన్ రెండో ఓవర్లో సుదర్శన్ నాలుగు బౌండరీలు దంచడంతో ఆ ఓవర్లో 20 రన్స్ వచ్చాయి. మరో ఎండ్‌లో గిల్.. కుదురుకునేదాకా కాస్త నెమ్మదిగా ఆడాడు. సుదర్శన్ కూడా జోరు తగ్గించినా రన్ రేట్ మాత్రం 7కు తగ్గకుండా చూసుకున్నాడు. అక్షర్ 9వ ఓవర్లో బౌండరీతో సుదర్శన్ అర్ధ శతకం పూర్తయింది. అదే ఓవర్లో సిక్సర్ బాదిన గిల్.. ఓవర్‌కు సిక్స్‌కు తగ్గకుండా బాదాడు. చమీర ఓవర్లో బౌండరీతో గిల్ కూడా ఫిఫ్టీ సాధించాడు. ఇద్దరూ అర్ధ శతకాల తర్వాత బౌండరీలు, సిక్సర్ల మోత మోగించడంతో టైటాన్స్ లక్ష్యాన్ని వికెట్ నష్టపోకుండా దంచేసింది. కుల్‌దీప్ 18వ ఓవర్లో సిక్సర్‌తో సాయి.. ఐపీఎల్‌లో రెండో శతకాన్ని నమోదుచేశాడు.

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 199/3 (రాహుల్ 112*, పౌరెల్ 30, అర్షద్ 1/7, ప్రసిద్ధ్ 1/40); **గుజరాత్:** 19 ఓవర్లలో 205/0 (సాయి 108*, గిల్ 93*)

విజేతలుగా అల్కరాజ్, జాస్మిన్

రోమ్: ఇటాలియన్ ఓపెన్ సింగిల్స్ విభాగాల్లో కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్), జాస్మిన్ పవులోని (ఇటలీ) టైటిల్స్ గెలిచారు. పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో అల్కరాజ్.. 7-6 (7/5), 6-1తో యానిక్ సిన్నర్ (ఇటలీ)ని ఓడించాడు. మహిళల సింగిల్స్ ఫైనల్‌లో ఇటలీ టెన్నిస్ స్టార్ జాస్మిన్ పవులోని.. 6-4, 6-2తో కోకో గాఫ్ (అమెరికా)ను చిత్తు చేసి టైటిల్ దక్కించుకుంది.

రన్నరప్‌గా బాంబ్రీ



ఢిల్లీ: ఈ ఏడాది రెండో డబుల్స్ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన భారత టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ.. ఆఖరి మెట్టుపై తడబడ్డాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న బోర్డెక్స్ చాలెంజర్ టోర్నీలో భాగంగా ఆదివారం ముగిసిన పురుషుల డబుల్స్ ఫైనల్‌లో నాలుగో సీడ్ బాంబ్రీ, రాబర్ట్ గాలోవే (అమెరికా) ద్వయం.. 6-7 (1/7), 6-7 (2/7)తో ఫ్రాన్సిస్కో కాబ్రల్ (పోర్చుగల్)-లుకాస్ మీడ్లర్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓటమిపాలైంది.

వధేర, శశాంక్ మెరుపులు

పంజాబ్ ధనాధన్

రాజస్థాన్‌పై పంజాబ్ ఉత్కంఠ విజయం • రాయల్స్‌కు పదో పరాభవం

వారం రోజుల వాయిదా తర్వాత శనివారం పునఃప్రారంభమైన ఐపీఎల్-18లో తొలి మ్యాచ్ వర్షార్పణమైనప్పటికీ ఆదివారం డబుల్ హెడర్ మ్యాచ్‌లు అభిమానుల్లో జోష్‌ను నింపాయి. జైపూర్‌లో భారీ స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్.. రాజస్థాన్ రాయల్స్‌ను 10 పరుగుల తేడాతో ఓడించింది. బ్యాటింగ్‌లో టాపార్డర్ విఫలమైనా నెహాల్, శశాంక్ మెరుపులతో భారీ స్కోరు సాధించిన ఆ జట్టు.. ఛేదనలో రాయల్స్‌ను నిలువరించింది. అనంతరం రెండో మ్యాచ్‌లో గుజరాత్.. ఢిల్లీని ఓడించడంతో ఆ జట్టుతోపాటు పంజాబ్, బెంగళూరు ప్లేఆఫ్స్ చేరాయి.



జైపూర్: ఈ సీజన్‌లో సమిష్టి ప్రదర్శనతో అదరగొడుతున్న పంజాబ్ కింగ్స్ ప్లేఆఫ్స్ చేరింది. ఆదివారం జైపూర్ వేదికగా ఆ జట్టు.. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థిని 10 పరుగుల తేడాతో ఓడించింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన హైస్కోరింగ్ థ్రిల్లర్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కింగ్స్.. నెహాల్ వధేర (37 బంతుల్లో 70, 5 ఫోర్లు, 5 సిక్సర్లు), శశాంక్ సింగ్ (30 బంతుల్లో 59 నాటౌట్, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించడంతో 20 ఓవర్లలో 219/5 స్కోరు సాధించింది. రికార్డు ఛేదనలో రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 209/7 వద్దే ఆగిపోయింది. ధ్రువ్ జురెల్ (31 బంతుల్లో 53, 3 ఫోర్లు, 4 సిక్సర్లు), యశస్వీ జైస్వాల్ (25 బంతుల్లో 50, 9 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (15 బంతుల్లో 40, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) దూకుడుగా ఆడినా ఆఖర్లో తడబడ్డ ఆ జట్టు మూల్యం చెల్లించుకుంది. కింగ్స్ గెలుపులో కీలకపాత్ర పోషించిన స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రర్ (3/22)కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. 11 ఏండ్ల తర్వాత ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ చేరడం పంజాబ్‌కు ఇదే మొదటిసారి.

రాయల్స్‌ది రొటీన్ స్టోరీ

భారీ ఛేదనలో రాయల్స్‌ది పాత కథే! ఓపెనర్లు మెరుపు వేగంతో పరుగులు రాబట్టి బలమైన పునాది వేసినా మిడిలార్డర్ తడబడటం, విజయం ముంగిట బోల్తా కొట్టడాన్ని ఈ సీజన్‌లో ఆనవాయితీగా మలుచుకున్న ఆ జట్టు.. పంజాబ్‌తోనూ దానినే కొనసాగించింది. ఓపెనర్లు జైస్వాల్, వైభవ్ మొదటి బంతినుంచే దంచుడు మంత్రాన్ని జపించడంతో పవర్‌ప్లేలోనే ఆ జట్టు స్కోరు 89/1గా నిలిచింది. అర్ష్‌దీప్ తొలి ఓవర్లోనే జైస్వాల్.. నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 22 పరుగులు రాబడితే యాన్సెన్ రెండో ఓవర్లో వైభవ్.. 6, 4, 6తో 17 రన్స్ పిండుకున్నాడు. 2.5 ఓవర్లకే రాజస్థాన్ 50 రన్స్ మార్కును అందుకుంది. అయితే పంజాబ్ సారథి శ్రేయాస్ స్థానంలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన బ్రర్.. మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చాడు. ఐదో ఓవర్‌లో బంతినందుకున్న అతడు.. ఐదో బంతికి వైభవ్‌ను ఔట్ చేసి రాయల్స్‌ను తొలి దెబ్బ కొట్టడంతో 76 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. మూడో స్థానంలో వచ్చిన శాంసన్ (20)తో కలిసి జోరును కొనసాగించిన జైస్వాల్ 24 బంతుల్లో ఈ సీజన్‌లో ఆరో అర్ధ శతకాన్ని నమోదుచేశాడు. కానీ ఆ తర్వాతి బంతికే అతడు లాంగాఫ్ వద్ద మిచెల్ చేతికి చిక్కాడు. ఈ వికెట్ కూడా బ్రర్‌కే దక్కింది. అక్కడ్నుంచి రాయల్స్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. శాంసన్, పరాగ్ (13), హెట్‌మయర్ (7) విఫలమయ్యారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా పట్టుదలగా క్రీజులో నిలిచిన జురెల్.. ఒంటరిపోరాటంతో రాయల్స్‌లో గెలుపు ఆశలు నింపాడు. కానీ చివరి ఓవర్లో యాన్సెన్ అతడిని ఔట్ చేయడంతో రాజస్థాన్ ఓటమి ఖరారైంది. ఈ సీజన్‌లో రాజస్థాన్ 9 మ్యాచ్‌లలో ఛేదనకు దిగి ఏకంగా 8 మ్యాచ్‌లు ఓడిపోవడం గమనార్హం.

వధేర, శశాంక్ దూకుడు

34/3.. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 4 ఓవర్లకు చేసిన స్కోరిది. ఓపెనర్లు ప్రియాన్స్ (9), ప్రభ్‌సిమ్రన్ (21) నిరాశపరచగా భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆసీస్ బ్యాటర్ మిచెల్ ఓవెన్ డకౌట్ అయ్యాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయాస్..

నెహాల్‌కు జతకలిసి కింగ్స్ ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించాడు. ఈ ఇద్దరూ ఓవర్‌కు రెండు బౌండరీలకు తక్కువ కాకుండా దంచడంతో పంజాబ్ ఇన్నింగ్స్ 9 రన్‌రేట్‌కు తగ్గకుండా దూసుకెళ్లింది. నాలుగో వికెట్‌కు 44 బంతుల్లోనే 67 రన్స్ జోడించిన ఈ జోడీని 11వ ఓవర్లో పరాగ్ విడదీశాడు. కానీ అప్పటికే క్రీజులో కుదురుకున్న నెహాల్.. చెలరేగి ఆడాడు. ఆకాశ్ మధ్వాల్ ఓవర్లో బౌండరీతో ఫిఫ్టీ పూర్తిచేసిన నెహాల్.. అతడే వేసిన 16వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి హెట్‌మయర్‌కు క్యాచ్ ఇచ్చాడు. వధేర ఔట్ అయినా శశాంక్.. అజ్మతుల్లా (21 నాటౌట్)తో కలిసి మెరుపులు మెరిపించాడు. మఫక ఓవర్లో అజ్మతుల్లా 4, 6, 4 దంచగా తుషార్ చివరి ఓవర్లో శశాంక్ 6, 4 బాదడంతో ఆ జట్టు ప్రత్యర్థి ఎదుట భారీ లక్ష్యాన్ని నిలిపింది.

సంక్షిప్త స్కోర్లు

పంజాబ్: 20 ఓవర్లలో 219/5 (నెహాల్ 70, శశాంక్ 59*, తుషార్ 2/37, పరాగ్ 1/26); **రాజస్థాన్:** 20 ఓవర్లలో 209/7 (జురెల్ 53, జైస్వాల్ 50, బ్రర్ 3/22, యాన్సెన్ 2/41)

సాఫ్ విజేత భారత్

ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై విజయం

యుపియా: సాఫ్ అండర్-19 చాంపియన్‌షిప్ టైటిల్‌ను యువ భారత జట్టు సొంతం చేసుకుంది. ఆదివారం యుపియా (అరుణాచల్‌ప్రదేశ్)లో జరిగిన ఫైనల్‌లో భారత్ 1-1 (4-3)తో బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. నిర్దేశిత సమయానికి ఇరు జట్ల స్కోర్లు సమం కాగా.. పెనాల్టీ షూటౌట్ ద్వారా తేలిన ఫలితంలో యువ భారత్ అదరగొట్టింది. మొదట 2వ నిమిషంలోనే గోల్ కొట్టిన భారత్.. ఆ తర్వాత ఆ జోరు చూపించలేకపోయింది. 61వ నిమిషంలో జాయ్ అహ్మద్ గోల్ చేయడంతో బంగ్లా స్కోరును సమం చేసింది. షూటౌట్‌లో భారత్ వరుసగా హ్యాట్రిక్ గోల్స్ చేసి విజేతగా నిలిచింది.

మనిక, మానవ్ ముందంజ

టేబుల్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్

దోహా: టేబుల్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ప్యాడ్లర్లు మనిక బాత్రా, మానవ్ టక్కర్ శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లలో ఈ ఇద్దరూ తొలి రౌండ్ విఘ్నాన్ని విజయవంతంగా అధిగమించారు. మహిళల సింగిల్స్‌లో 22వ సీడ్‌గా బరిలోకి దిగిన మనిక.. 4-0 (11-5, 11-6, 11-2, 11-2)తో ఫాతిమా బెల్లా (నైజీరియా)పై అలవోక విజయం సాధించింది. 24 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో మనిక.. వరుస సెట్లలో గెలిచి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో మానవ్.. 4-1 (11-3, 11-8, 6-11, 11-7, 14-12)తో తిమోతి చోయ్ (న్యూజిలాండ్)ను ఓడించాడు. ఈ ఇద్దరూ గెలిచినా మిగిలిన మ్యాచ్‌లలో భారత్‌కు నిరాశే ఎదురైంది. పురుషుల సింగిల్స్‌లో అంకుర్, మిక్స్‌డ్ డబుల్స్‌లో మనుష్-దివ్య ద్వయం, పురుషుల డబుల్స్‌లో హర్మీత్ -సతియన్ జోడీ అపజయం పాలైంది.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్ ✓	12	9	3	0	18	0.79
బెంగళూరు ✓	12	8	3	1	17	0.48
పంజాబ్ ✓	12	8	3	1	17	0.38
ముంబై	12	7	5	0	14	1.15
ఢిల్లీ	12	6	5	1	13	0.26
కోల్‌కతా X	13	5	6	2	12	0.19
లక్నో	11	5	6	0	10	-0.46
హైదరాబాద్ X	11	3	7	1	7	-1.19
రాజస్థాన్ X	13	3	10	0	6	-0.70
చెన్నై X	12	3	9	0	6	-0.99

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

సమరమన్నారు.. సల్లబడ్డారు!

మొదటిపేజీ తరువాయి...

వేయడంపై, జేఏసీ తీరుపై రాష్ట్రంలోని 13.5 లక్షల ఉద్యోగుల్లో అత్యధికులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. పోరాడి డిమాండ్లు సాధించుకోవాల్సిన తరుణంలో, సమస్యలను పరిష్కరించుకోవాల్సిన తరుణంలో ఉద్యోగ జేఏసీ నేతలు పోరుబాటను వాయిదావేయడంపై సోషల్‌మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. జేఏసీ నాయకత్వంపై ఉద్యోగులతోపాటు జేఏసీ భాగస్వామ్య సంఘాల నేతలు సైతం అసంతృప్తిని వ్యక్తంచేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. '57 డిమాండ్లల్లో కనీసం కొన్నింటినైనా పరిష్కరిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాక పోరాటాన్ని వాయిదావేస్తే బాగుండు' అని జేఏసీలోని ఒక నేత అభిప్రాయపడ్డారు. 'సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల ఉద్యోగులు రగిలిపోతున్నారు. సీఎంకు దీటుగా జేఏసీ నాయకత్వం నిలబడుతుందనుకున్నాం. కానీ, తుస్సుమనిపించారు. సీరియస్‌గా పోరాటం చేయాలన్న ఆలోచన జేఏసీ నాయకత్వానికి లేదు' అని మరో జేఏసీ నేత వ్యాఖ్యానించారు. 'డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు తెగించి కొట్లాడాల్సి ఉండె'ననే అభిప్రాయాన్ని కొన్ని సంఘాల నేతలు వ్యక్తంచేస్తున్నారు. సర్కారుపై సమరమంటూ ప్రకటించిన ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు మధ్యలోనే కాడెత్తేశారంటూ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

క్షేత్రస్థాయి నుంచి వ్యతిరేకత

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల 57 పెండింగ్ డిమాండ్లపై తాడేపేడో తేల్చుకునేందుకు ఉద్యోగ సంఘాల జేఏసీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించిన నేపథ్యంలో.. ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో జేఏసీ తమ కార్యాచరణను వాయిదావేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 15న నల్లబ్యాడ్జీలతో తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని వాయిదావేసింది. జూన్ 9న నిర్వహించాల్సిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని సస్పెన్స్‌లో పెట్టింది. దీంతో ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకత్వంపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. సర్కారుతో రాజీపడ్డారా? అంటూ ఉద్యోగులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. 'ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెండింగ్‌లో పెట్టబోమని, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నవి దశలవారీగా చెల్లిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనమండలిలో ఇచ్చిన హామీ కూడా కార్యరూపం దాల్చలేదు. ఈ ఒక్క ఏడాదిలో తొమ్మిది వేల మంది ఉద్యోగ విరమణ పొందగా, ఒక్కరికి కూడా రిటైర్మెంట్ బినిఫిట్స్ అందలేదు. దీంతో 500 మంది హైకోర్టును ఆశ్రయించారు' అని ఉద్యోగులు తెలిపారు.

స్వలాభం కోసం పావులు!

తెలంగాణ ఉద్యమ సమయంలోనే రాష్ట్రంలో ఉద్యోగ సంఘాల జేఏసీ ఏర్పాటైంది. అప్పుడే అన్ని సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చాయి. స్వరాష్ట్ర సాధన కోసం జేఏసీ తెగించి కొట్లాడింది. 42 రోజులపాటు సకల జనుల సమ్మెను దిగ్విజయంగా నిర్వహించింది. ఉద్యోగుల సత్తాను దేశానికి చాటిచెప్పింది. ఆ తర్వాత కూడా జేఏసీ కొనసాగింది. అయితే, ఆ తరువాత మళ్లీ ఇప్పుడే 13.5 లక్షల ఉద్యోగులు, 200కుపైగా ఉద్యోగ సంఘాలతో ఉద్యోగ సంఘాల జేఏసీ ఏర్పాటైంది. ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. తీరా ఉద్యమాన్ని వాయిదా వేయడాన్ని ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఉద్యమం పేరుతో తమకు కావాల్సిన కొన్ని డిమాండ్లను కీలక సంఘాలు పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నాయనే ఆరోపణలొస్తున్నాయి. ముఖ్యంగా కీలక ఉద్యోగ సంఘాలకు కావాల్సిన ఉద్యోగ సంఘాలకు గుర్తింపు (రికగ్నిషన్), జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు వంటి డిమాండ్లను పరిష్కరించుకునేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. వీటితో ఐదారు సంఘాలకే లాభం జరుగుతున్నదని, ఇందుకోసమేనా జేఏసీ? అంటూ పలువురు ఉద్యోగ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బయటికేమో ఐదు డీఏలు.. లోపలేమో ఒకటి!

జేఏసీలోని కొందరు నేతల తీరుపై ఉద్యోగవర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'బయట గాండ్రింపులకు దిగుతూ.. సర్కారు పెద్దల దగ్గర మాత్రం నక్క వినయం ప్రదర్శిస్తున్నారు' అనే చర్చ ఉద్యోగుల్లో జరుగుతున్నది. బయటికి ఐదు డీఏలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూనే, ప్రభుత్వ పెద్దల ముందు మాత్రం ఒకటి, రెండు డీఏలు ఇచ్చినా చాలు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే చర్చ నడుస్తున్నది. ఇక రిటైర్మెంట్ బెనిఫిట్స్ అత్యంత కీలక అంశం. పీఆర్సీ ఇవ్వకపోవడంతో ఉద్యోగులకు తీరని నష్టం జరుగుతున్నది. ఇంతవరకు పీఆర్సీ కమిటీ నుంచి నివేదికను సర్కారు తెప్పించుకోలేదు. 'ముందు ఆర్థికేతర డిమాండ్లు పరిష్కరించండి' అని కొందరు నేతలు ప్రభుత్వ వర్గాలతో చెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే డిమాండ్లను పక్కపెట్టినట్టేనా? అనే సందేహం ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నది. ఇదే నిజమైతే పెన్షనర్లకు తీరని అన్యాయం జరుగుతుందనే ఆవేదన వ్యక్తమవుతున్నది. 'డిమాండ్లు పరిష్కారం కాకపోవడంతో కిందిస్థాయి ఉద్యోగుల నుంచి తీవ్రమైన ఒత్తిడి వస్తున్నది. అమీతుమీ తేల్చుకోవాల్సిన తరుణంలో ఇలా ఉద్యమాన్ని వాయిదావేయడంతో జేఏసీ నాయకత్వంపై నమ్మకం సడలుతున్నది' అని జేఏసీ కో చైర్మన్ ఒకరు అభిప్రాయపడ్డారు. 'ఆర్థిక డిమాండ్లను పక్కనపెట్టి, ముందు ఆర్థికేతర డిమాండ్లను పరిష్కరించండి అంటూ బహిరంగ ప్రకటన చేశారు. పత్రికా ప్రకటన కూడా ఇచ్చారు. ఆర్థికేతర డిమాండ్ల పరిష్కారానికే అయితే జేఏసీ ఎందుకు, నాయకత్వమెందుకు?' అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

జేఏసీలోనూ లుకలుకలు!

ఉద్యోగ సంఘాల జేఏసీలోనూ లుకలుకలు ఉన్నట్టు ఉద్యోగవర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. కొంతమంది నేతల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. జేఏసీ నాయకత్వ వ్యవహార శైలిపై కొన్ని సంఘాల నేతలు గుర్రుగా ఉన్నట్టు సమాచారం. ఉద్యోగుల ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 15న జిల్లాల్లో ధర్నాలు నిర్వహించాలని మెజార్టీ సంఘాలు అభిప్రాయపడ్డాయట. అయితే, సర్కారుతో సఖ్యతతో ఉన్న కొందరు నాయకులు మాత్రం మెజార్టీ అభిప్రాయాన్ని కాదని, కేవలం నల్లబ్యాడ్జీలతో నిరసనలు చేపట్టాలని తీర్మానం చేశారట! ఇక ఒక కీలక నేత టీవీ చానల్ చర్చలో పాల్గొనడంపై మరికొందరు నేతలు అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తున్నది. ఉద్యోగుల సమస్యలపై సీరియస్‌గా ఉద్యమం చేయాలన్న ఆలోచన జేఏసీలోని కీలక నేతలకు లేదని నాయకులు చర్చించుకుంటున్నారు.

ఉద్యోగ జేఏసీ తీరుపై సోషల్ మీడియాలో ఇలా..

ఉద్యోగ సంఘాల జేఏసీ నేతల తీరుపై ఉద్యోగవర్గాలు సోషల్ మీడియా వేదిక తమ అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నారు. పోస్టులు పెడుతున్నారు. వాటిలో మచ్చుకు కొన్ని..

- ఉద్యమం చేస్తామని మభ్యపెట్టి మధ్యలో కాడెత్తేస్తారా?
- పశ్చిమబెంగాల్‌లో 25% డీఏ కోసం ఉద్యోగులు కోర్టుకెళ్లారు. మూడు నెలల్లో చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మన దగ్గర ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే ఇంకా మౌనం ఎందుకు? జేఏసీ సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడం లేదు? సర్కారుతో రాజీపడ్డారా?
- నన్ను కోసుకుని తింటారా? నన్ను వండుకుని తింటరా? అన్న సీఎంని ఎలా నమ్మేది. డిమాండ్లు పరిష్కారమవుతాయని ఎలా అనుకునేది?
- కల్యాణలక్ష్మి, పింఛన్లు, ఉచిత కరెంట్.. ఏది ఆపమంటారో మీరే చెప్పండి. ఇవన్నీ ఆపి మాకు జీతాలు పెంచండి, బోనస్ లు ఇవ్వండి అని అంటారా? అంటూ సీఎం అనడం ఉద్యోగులను దోషులుగా నిలబెట్టడమే.

సర్కారు తీరుపై ఇలా...

- ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చేందుకు రూ.లక్షలకు లక్షలు ఖర్చుచేస్తారు. 150, 480, 1200 మందికి నియామకపత్రాలిచ్చి రూ.పది లక్షలు, రూ.50 లక్షలు ఖర్చుచేస్తున్నారు. ఇది దుబారా కాదా?
- అందాల పోటీలకు, ఉచితాలకు డబ్బులుంటాయి. ఉద్యోగులు దాచుకున్నవే వారికి చెల్లించేందుకు డబ్బులుండవా?
- మా వాటా మేం చెల్లిస్తాం మహాప్రభో.. మా డబ్బులతో మాకు హెల్త్‌కార్డులు ఇవ్వకపోతే మాకు దేవుడే దిక్కు.
- జీపీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అనేవి మా కష్టార్జితం. పెండింగ్ బిల్లులు మాకు న్యాయంగా రావాల్సినవే. మేమేమైనా మా లోన్లు తీర్చమంటున్నమా? మాకు ఉచిత కరెంట్ ఇవ్వమంటున్నమా? ఉచితంగా ఇల్లు కట్టించమన్నమా? గ్యాస్ సిలిండర్ ఇవ్వమన్నమా?
- మా పిల్లలకు స్కాలర్‌షిప్‌లు లేవు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వరు. కనీసం మమ్మల్ని మనుషులుగా గుర్తించండి.

హైదరాబాద్‌లో భారీ పేలుళ్లకు కుట్ర?

- **విజయనగరంలో ఐసిస్ స్లీపర్‌సెల్ సిరాజ్ అరెస్ట్?**
- **హైదరాబాద్ వాసితో కాంటాక్ట్‌లో నింబితుడు**
- **ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ, దర్యాప్తు**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో భారీ పేలుళ్లకు ఐసిస్ కుట్ర చేస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. ఎన్ఐఏ, తెలంగాణ, ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు ఈ కుట్రను భగ్నం చేసినట్టు తెలిసింది. ఏపీలోని విజయనగరంలో తీగ లాగితే హైదరాబాద్‌లో డొంక కదిలిందని సమాచారం. సౌదీ నుంచి ఐసిస్, అనుబంధ సంస్థల ప్రతినిధులు ఇస్తున్న ఆదేశాలతో ఇక్కడ కుట్రకు సన్నాహాలు చేస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. విజయనగరంలోని సిరాజ్ ఉర్ రెహ్మాన్(29) అనే యువకుడిపై కొన్ని రోజులుగా నిఘా సంస్థలు దృష్టి పెట్టాయి. అతడి ప్రవర్తన, ఆన్‌లైన్ చాటింగ్స